క్లుప్తంగా

వీరాంజనేయస్వామికి వెండి వక్షస్థల కవచం



వక్షస్థల కవచాన్ని బహూకరిస్తున్న రంగచార్యులు మాస్టర్

అగనంపూడి: అగనంపూడి శివారు నిర్వాసిత కాలనీలోని వీరాంజనేయస్వామి వారికి వెండితో తయారు చేయించిన వక్షస్థల కవచాన్ని సోమవారం అలంకరించారు. పెదమడకకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పీతాంబరం రంగాచార్యులు అందించిన నిధులతో ఈ వెండి తొడుగును తయారు చేయించారు. సోమవారం సుదర్శన హవన పూర్వకంగా విశేష పూజలు చేసి, ఈ తొడుగును అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'తో ఇంటికే వైద్య సేవలు



వృద్ధునికి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ గీత

అక్కిరెడ్డిపాలెం: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా రోగుల ఇంటి వద్దకే వైద్య సేవలు అందడంతో రోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో డాక్టర్ గీత సోమవారం మంచానికే పరిమితమైన రోగులను, వృద్ధులను వారి ఇంటికే వెళ్లి పరీక్షించారు. రోగులకు సూచనలు ఇచ్చి, నెలకు సరిపడా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



పారాయణం చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: స్థానిక బీసీ రోడ్డు దయాళ్‌నగర్‌లో గల భక్తాంజనేయస్వామి ఆలయంలో శ్రావణ బహుళ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కన్నెపల్లి సీతాపతి శర్మ ఆధ్వర్యంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.

రేపటి నుంచి జనరల్ యోగా తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 13 నుంచి జనరల్ యోగా, థెరపీ యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నాలుగు బ్యాచ్‌లుగా తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.

ముంచెత్తిన వాన



వుడా కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

లోతట్టు ప్రాంతాలు జలమయం

పెదగంట్యాడ: వర్షం ముంచెత్తింది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ బెంబేలెత్తించగా మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మేఘావృతమైంది. చిరుజల్లులతో మొదలై జడివానగా మారింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి.. రహదారులన్నీ చెరువులను తలపించాయి. వర్షం ముంచెత్తడంతో మండలంలోని నడుపూరు, హౌసింగ్ బోర్డు కాలనీ, డెయిరీ కాలనీ, బర్మా కాలనీ, రామచంద్రనగర్ తదితర ప్రాంతాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని నివాసితుల ఇళ్లలోకి నీరు రావడంతో అవస్థలు పడ్డారు. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు సాగించలేకపోయారు.

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం, వడ్లపూడి తదితర ప్రాంతాల్లో జడివానకు రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు ఎదుర్కొన్నారు.



వడ్లపూడి ప్రాంతంలో కురుస్తున్న వర్షం



ఎన్‌టీఆర్ నగర్‌లో జలమయమైన రోడ్లు



పొంగి ప్రవహిస్తున్న నడుపూరు గెడ్డ

మంత్రి రాజశేఖర్‌కు ప్రముఖుల పరామర్శ

గాజువాక: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్‌ను పలువురు ప్రముఖులు సోమవారం పరామర్శించారు. జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి దంపతులు, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మార్టుపూడి పరదేశి, ఎన్నేటి రమణ, బోరా శశిభూషణ్ తదితరులు ఆస్పత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు.

పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్‌ను సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవింద ఆస్పత్రిలో పరామర్శించారు. వేగంగా కోలుకుని ఇంటికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్టీల్ ఇంటక్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు, ఎల్లాజీ, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మంత్రి రాజశేఖర్‌తో మేయర్ గొలగాని హరివెంకట కుమారి దంపతులు

18 నుంచి వినాయక నవరాత్రి ఉత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంపత్ వినాయక ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ పెదమడకలోని సంపత్ వినాయక ఆలయంలో ఈ నెల 18 నుంచి వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్సవాల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18వ తేదీ నుంచి 9 రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాలను వారు వివరించారు. ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు.

ఘనంగా ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



పల్లకీ మోస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



పూజల్లో పాల్గొన్న సేవా సమితి సభ్యులు, భక్తులు

పెదగంట్యాడ: ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక వుడా కాలనీ వినాయక నగర్ వుడా ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కృష్ణుడి పల్లకీ ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు ఎ.శ్రీనివాస్, గణేష్, ఎ.మోహన్‌రావు, వై.వి.రమణ, ఉష, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రీకాంతాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించాయ.

చెరువు ఆక్రమణకు స్కెచ్



కృష్ణమహంతి చెరువును డెబ్రిస్‌తో కప్పేస్తున్న దృశ్యం

- కబ్జా కోరల్లో కృష్ణమహంతి చెరువు
- డెబ్రిస్‌తో కప్పేసి, జీవీఎంసీపై నింద
- అయినా పట్టించుకోని అధికారులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలోని కృష్ణమహంతి చెరువుపై కబ్జాదారుల కన్ను పడింది. గతంలో 19 ఎకరాలున్న చెరువు ఆక్రమణల కారణంగా ఇప్పుడు సుమారు 15 ఎకరాలు మాత్రమే మిగిలింది. ఇప్పుడు దాన్ని కబ్జాదారులు పక్కాగా స్కెచ్ వేసి.. గప్‌చుప్‌గా ఆక్రమించేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

డెబ్రిస్‌తో కప్పేస్తున్నారు

నాతయ్యపాలెం రామాలయం పక్క నుంచి షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి చెరువు గట్టు నుంచి రోడ్డు మార్గం ఉంది. గ్రామంలో చెరువు ప్రారంభం వద్ద గతంలో చెరువు గట్టును ఏర్పాటు చేశారు. ఈ గట్టు నుంచి రామాలయం ప్రారంభం వద్ద నుంచి పక్కా ప్రణాళికతో భారీగా డెబ్రిస్‌ను రప్పించి మెల్లగా చెరువును కప్పేస్తున్నారు. ఇంత బహిరంగంగా చెరువు కబ్జా జరుగుతున్నా ఎవరూ పెదవి విప్పకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇలా ఆక్రమిస్తున్న ప్రాంతం సుమారు 5 ఎకరాలు కాగా.. దాని విలువ కోట్ల రూపాయల్లో ఉంటుందని అంచనా. అంతా చేసి చెరువులో శానిటరీ విభాగం వారు చెత్తను వేస్తున్నారంటూ వారిపై నింద వేస్తూ.. తమ పని తాము చేసుకుపోతున్నారు.

ఆధునికీకరణకు రూ.2 కోట్లు

ఒకవైపు చెరువు సుందరీకరణ, ఆధునికీకరణ పనుల కోసం జీవీఎంసీ రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇంతలోనే గుట్టుగా చెరువును ఆక్రమించేయడం గమనార్హం.

వినతి సమర్పించినా..

చెరువుకు సర్వే నిర్వహించి గతంలో ఉన్న 19 ఎకరాలు చెరువును కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకుని చెరువు సుందరీకరణ చేపట్టాలని వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు జీవీఎంసీకి వినతిపత్రం సమర్పించినా ఫలితం శూన్యం. ఇప్పుడు ఏకంగా కళ్లెదుటే జరుగుతున్న చెరువు కబ్జాను ఇటు రెవెన్యూ కానీ, అటు జీవీఎంసీ అధికారులు గానీ కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

'విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తక రచనలు'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తక రచనలు చేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు రచించిన 'ఫిలసాఫికల్ పర్‌స్పెక్టివ్స్ ఆన్ టీచర్ ఎడ్యుకేషన్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భవిష్యత్ తరం ఉపాధ్యాయులుగా నిలిచే వారికి, ఉపాధ్యాయ వృత్తిలో అడుగిడే వారికి ఉపయుక్తంగా పుస్తక రచన చేయడం అభినందనీయమన్నారు. పరిశోధకులకు ఈ పుస్తకం ఒక చక్కని మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం పుస్తక రచయిత షారోన్‌రాజును వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య రాంజీ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలి



శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: కార్మికులు ఉక్కు పరిశ్రమ కోసం పట్టు వదలక పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరి కాదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. నిర్వాసితుల త్యాగాలు, కార్మికుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 942వ రోజు, సోమవారం సంస్థకు చెందిన డబ్ల్యూ.ఆర్.ఎం-1, 2 విభాగ కార్మికులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని రాష్ట్ర ప్రజలు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు కోరుతున్నారన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రానికి ఈ ప్రాంత ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశపెట్టాలని, లేకుంటే తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి ప్రోత్సాహం



దివ్యాంగులకు వినికిడి యంత్ర సామగ్రి అందజేస్తున్న పరిశీలకులు డాక్టర్ రామ్‌కమల్, నరసింహం

పరవాడ: దివ్యాంగుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్య పరిశీలకుడు డాక్టర్ రామ్ కమల్, డాక్టర్ వై.నరసింహం చెప్పారు. పరవాడ భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష సహిత విద్య పరిశీలకుల బృందం సోమవారం సందర్శించింది. భవిత కేంద్రంలో దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కేంద్రంలో 27 మంది బుద్ధిమాంద్యం కలిగిన చిన్నారుల అవసరాలు తీర్చడానికి వీలుగా ప్రభుత్వం రూ.2.70లక్షలతో సమకూర్చిన బోధన సామగ్రి కిట్లు, వినికిడి లోపం కలిగిన ఆరుగురు చిన్నారులకు రూ.1.80 లక్షల విలువైన వినికిడి యంత్రాలను పరిశీలకులు రామ్‌కమల్, నరసింహం అందజేశారు. అనంతరం కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో నిర్మించిన భవిత కేంద్రం పరిశీలించి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని అభినందించారు. అనకాపల్లి సహిత విద్య సమన్వయకర్త శకుంతల భవిత కేంద్ర పురోగతిని పరిశీలకులకు వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి దివాకర్, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్, మహలక్ష్మినాయుడు, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెచ్‌ఎస్‌ఎల్ అధికారులకు ఐఐఎంలో శిక్షణ



శిక్షణకు హాజరైన అధికారులతో ఐఐఎంవీ అధికారులు

ఏయూ క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ అధికారులకు ఐదు రోజుల కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. 23 మంది హెచ్‌ఎస్‌ఎల్‌కు చెందిన మేనేజర్లు హాజరైన ఈ శిక్షణలో ముఖ్యఅతిథిగా హెచ్‌ఎస్‌ఎల్ జనరల్ మేనేజర్ ఎస్.అశోక్‌కుమార్ మాట్లాడుతూ నిరంతర అభ్యసనం ప్రాధాన్యతను వివరించారు. ఐఐఎంవీ డీన్(పరిపాలన) ఆచార్య ఎం.వి.అనూరాధ మాట్లాడుతూ నాయకత్వాన్ని పెంచేలా వివిధ సంస్థల అధికారులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. కార్యక్రమ సంచాలకుడు ఆచార్య బాలాజి సుబ్రమణియన్, తదితరులు ప్రసంగించారు.

బంద్ విఫలం

- గాజువాకలో కనిపించని ప్రభావం
- యథావిధిగా జనజీవనం



గాజువాకలో తెరిచి ఉన్న దుకాణాలు

గాజువాక: తెలుగుదేశం ఇచ్చిన బంద్ పిలుపునకు గాజువాక ప్రజలు స్పందించలేదు. దీంతో ఇక్కడ బంద్ ప్రభావం కనిపించలేదు. రోజూ మాదిరిగానే గాజువాకలోని అన్ని కూడళ్లు జనంతో కిక్కిరిసిపోయాయి. దుకాణాలు, షాపింగ్ మాళ్లు యథావిధిగా కొనసాగాయి. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ రవాణా వాహనాలు కూడా సాధారణ స్థితిలోనే తిరిగాయి. సినిమా హాళ్లు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పని చేశాయి. బంద్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. బంద్ నిర్వహణలో టీడీపీ దిగువస్థాయి కార్యకర్తలు ఎక్కడా కనిపించలేదు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొంతమంది నాయకులు మాత్రం కొత్త గాజువాలో దుకాణాలను మూయించేందుకు రోడ్డుపైకి రావడంతో వారిని పోలీసులు అరెస్టు చేసి స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పెదగంట్యాడ: పెదగంట్యాడలో బంద్ ప్రభావం కనిపించలేదు. వ్యాపారాలు, మార్కెట్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు యథావిధిగా కొనసాగాయి. ఈ బంద్‌కు జనసేన నాయకులు దూరమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపునకు స్టీల్‌ప్లాంట్‌లో స్పందన కానరాలేదు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు యథావిధిగా విధులకు హాజరయ్యారు. ఉద్యోగుల కోసం ప్లాంట్‌కు ఆర్టీసీ నడిపే 13 బస్సులు యథావిధిగా తిరిగాయి. టౌన్‌షిప్‌లోని దాదావు అన్ని సెక్టార్లలో షాపులు తెరిచే ఉన్నాయి. బ్యాంకులు తమ వాణిజ్య కార్యక్రమాలు కొనసాగించాయి. ఉక్కునగరంలో నామమాత్రంగా ఉండే టీడీపీ నాయకులు ఇద్దరిని, గాజువాకకు చెందిన కొంతమందిని స్టీల్‌ప్లాంట్ పోలీసు స్టేషన్‌కు తరలించారని స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు తెలిపారు.

ఆర్టీసీ సర్వీసులు యథాతథం

ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోకు చెందిన 99 సర్వీసులు యథావిధిగా నడిచాయి. ఏ అవాంతరం లేకుండా బస్సులను నడుపుతున్నామని డిపో అసిస్టెంట్ మేనేజర్ జి.రమణమూర్తి తెలిపారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

26వ రోజుకు శ్రీలక్ష్మీ పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు సోమవారం 26వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు.

నేటి నుంచి ఐడీఆర్‌సీ తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో పర్యావరణ శాస్త్రంపై ఇంటర్ డిసిప్లీనరీ రిఫ్రెషర్ కోర్స్ నిర్వహించనున్నట్లు హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వి.కృష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు సమన్వయకర్తగా ఏయూ పర్యావరణ శాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు ఇ.ఉదయ భాస్కరరెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు.

పబ్లిక్ డిమాండ్

తాగునీరు వృథా



ఉడా ఫేజ్-1లో రోడ్డు మీద వృథాగా పోతున్న తాగునీరు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు ఉడా ఫేజ్-1లో మంచినీటి పైప్‌లైన్లు పగిలి తాగునీరు వృథాగా పోతోంది. ఒకవైపు సంబంధిత ప్రాంతాల ప్రజలకు పూర్తి స్థాయిలో నీటిసరఫరా లేక ఇబ్బంది పడుతుండగా.. మరోవైపు వృథాగా పోతున్న నీరు రోడ్డుపైకి చేరి వాహనాలు జారిపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలి.

– శ్రీనివాసరావు, ఉడా ఫేజ్-1